సాక్షి మంచిర్యాల

ఆదివారం । 10 । సెప్టెంబర్ । 2023



'చెక్క'ని గుమ్మాలు 11లో▸

పల్లెల్లో ఇంటి గుమ్మాలు ఆకట్టుకుంటున్నాయి. ఓల్డ్ ఈజ్ గోల్డ్ అంటూ పాతకాలం తరహాలో చక్కని డిజైన్‌తో గుమ్మాలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

ఈ నెల 21న ఏరియర్స్ చెల్లింపు

నస్పూర్: సింగరేణి కార్మికులకు 11వ వేజ్ బోర్డుకు సంబంధించిన 23 నెలల ఏరియర్స్ ఈనెల 21న ఒకే దఫా చెల్లించడానికి యాజమాన్యం అంగీకరించినట్లు టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి శనివారం తెలిపారు. ఉద్యోగుల శ్రమను గుర్తించి వారికి ఏరియర్స్ ఒకేదఫా చెల్లించడానికి కృషి చేసిన టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, అధ్యక్షుడు వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్యకు ఉద్యోగుల తరఫున శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 29.5 /25.3

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. వాతావరణం చల్లగా ఉంటుంది. రుతుపవనాల ప్రభావంతో జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే చిన్నయ్య



బెల్లంపల్లి: రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీ.రామారావును బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్.అంబేద్కర్ సచివాలయంలో ఎమ్మెల్యే చిన్నయ్య, మంత్రి కేటీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో మంత్రి చేసిన కృషిని అభినందించారు.

భాష పరిరక్షణ బాధ్యత ఉపాధ్యాయులదే



మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

మంచిర్యాలఅర్బన్: తెలుగు గొప్పదనాన్ని ముందు తరాలకు అందించాల్సిన గురుతర బాధ్యత తెలుగు భాష ఉపాధ్యాయులపై ఉందని క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.సత్యనారాయణ మూర్తి అన్నారు. జిల్లా కేంద్రంలోని సైన్స్ కేంద్రంలో తెలుగు భాష అభ్యసనాభివృద్ధి వేదిక (లిఫ్ట్) ఆధ్వర్యంలో కాళోజీ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను సృజన శీలురుగా తీర్చిదిద్దడానికి పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అంతకుముందు తెలంగాణ భాష దినోత్సవం పురస్కరించుకుని కాళోజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. లిఫ్ట్ వేదిక కన్వీనర్ గోపగాని రవీందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సాహితీవేత్త ముత్యబోయిన మలయశ్రీ, కోకన్వీనర్ కిషన్, సభ్యులు నీలాదేవి, సత్యనారాయణ, పద్మ, విశ్వప్రసాద్, పద్మజ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

చెన్నూర్: ప్రభుత్వం ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డీఏలు, ఐఆర్‌లను వెంటనే మంజూరు చేయాలని తపస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు కోరారు. స్థానిక శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో శనివారం మాట్లాడారు. బదిలీలు, పదోన్నతుల్లో అక్రమాలు జరుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు భారతీఆశోక్, నా యకులు ఏంపీఎం గోపాలరావు, కొట్టె నాగరా జు, సాంబయ్య, చందు, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎలక్షన్స్ స్ట్రాటజీ కమిటీ చైర్మన్‌గా ప్రేమ్‌సాగర్‌రావు




మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ ఎలక్షన్స్ స్ట్రాటజీ కమిటీ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యుడు కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావును నియమిస్తూ ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ కేసీ.వేణుగోపాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు పలువురు పీఎస్సార్‌కు అభినందనలు తెలిపారు.

బయోగ్యాస్ ప్లాంట్‌ను పరిశీలించిన కోఆర్డినేటర్



బయోప్లాంట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

జన్నారం: మండలంలోని దేవునిగూడ గ్రామ పంచాయతీ పరిధి కొత్తూరుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన బయో గ్యాస్ ప్లాంట్‌ను స్వచ్ఛ సురక్షణ్ సెంట్రల్ కోఆర్డినేటర్ వెంకటేశ్ శనివారం పరిశీలించారు. వ్యర్థాలు, ఆవు పేడతో బయోగ్యాస్ తయారు చేస్తూ పాఠశాలలో వంట చేయడం అభినందనీయమన్నారు. తయారు చేసే విధానం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రోత్సాహించిన ఈజీఎస్ సిబ్బందిని, గ్రామ సర్పంచ్ శిరీష రెడ్డి , కార్యదర్శి శ్రీలతను అభినందించారు.




ఓ క్షణం.. ఆలోచించు

క్షణికావేశం నిండు ప్రాణాన్ని బలిగొంటుంది. నువ్వొక్కడివే కాదు.. నీపై ఆధారపడిన వారి జీవితాలను ఛిద్రం చేస్తుంది. సమస్యలెన్ని ఉన్నా.. క్షణం ఆలోచించి చూడు.. పరిష్కారం దొరుకుతుంది. భవిత బంగారమవుతుంది. రోజులో పగలు, రాత్రి ఎంత సహజమో.. జీవితంలో కష్టసుఖాలూ అంతే. సుఖమొచ్చినప్పుడు పొంగిపోవద్దు. కష్టమొచ్చినప్పుడు కుంగిపోవద్దు. ఈ రెండింటిని సానుకూల దృక్పథంతో సమానంగా భావించి ముందుకు సాగితే ఎంత పెద్ద సమస్యనైనా సులువుగా అధిగమించవచ్చు. అయితే కొందరు చిన్న చిన్న కారణాలకే ఆత్మహత్యకు పాల్పడుతూ విలువైన జీవితానికి ముగింపు పలుకుతున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా క్షణికావేశంలో బలవన్మరణానికి పాల్పడుతున్నారు. కన్నవారికి, కట్టుకున్న వారికి దూరమవుతూ పుట్టెడు దుఃఖాన్ని మిగుల్చుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇటీవల ఇలాంటి ఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా ప్రత్యేక కథనం.

నాలుగేళ్లలో జిల్లాల వారీగా నమోదైన ఆత్మహత్యలు..

- వివరాలు 10లో▸



సఖ్యత కుదిరేనా?

- బీఆర్ఎస్ అసంతృప్తులకు బుజ్జగింపులు
- మంత్రి కేటీఆర్ దృష్టికి జిల్లా పరిస్థితి



మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్యేలు సుమన్, దివాకర్‌రావు, చిన్నయ్య, మాజీ ఎమ్మెల్యే అరవింద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బీఆర్ఎస్‌లో అసంతృప్తుల బుజ్జగింపులపర్వం మొదలైందా అంటే అవుననే సమాధానం వస్తోంది. జిల్లాలో సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు సిట్టింగులకు టికెట్ ఇవ్వడంపై అసంతృప్తితో ఉన్నారు. ఇప్పటికే కొందరు పార్టీని వీడారు. సిట్టింగ్ ఎమ్మెల్యే తీరుతోనే పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో కొంతమంది అసంతృప్త నాయకులు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌ను కలవడంతో నాయకుల మధ్య సఖ్యత కుదిరినట్లేనా అనే చర్చ జరుగుతోంది. హైదరాబాద్‌లో బీఆర్.అంబేద్కర్ సచివాలయంలో మంత్రి కేటీఆర్‌ను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విప్, బాల్కసుమన్, ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, చిన్నయ్యతోపాటు మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ శనివారం కలిశారు. మంత్రి కేటీఆర్ విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి ఐకేరెడ్డి, ఖానా పూర్ అభ్యర్థి జాన్సన్‌నాయక్, లోకభూమారెడ్డి కూడా కలిసి అభినందనలు తెలిపారు. ఈక్రమంలో మంచిర్యాల జిల్లాలో కొంతకాలంగా అసంతృప్త నాయకులుగా ఉంటున్న మాజీ ఎమ్మెల్యే అరవింద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ సైతం కేటీఆర్‌ను కలిశారు. ఈ సమయంలోనే జిల్లా రాజకీయాలను నాయకులు ప్రస్తావించినట్లు తెలిసింది.

అభ్యర్థిని మార్చాలని డిమాండ్..

ఇటీవల మంచిర్యాల అభ్యర్థిని మార్చాలని, లేకపోతే బీసీ అభ్యర్థిని బరిలోకి దింపుతామని అరవింద్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. ఆయన్ను బుజ్జగించేందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వద్దకు తీసుకెళ్లేందుకు జిల్లా ప్రజాప్రతినిధులు ప్రయత్నించారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ కూడా పార్టీ వీడేందుకు సిద్ధపడినట్లు వార్తలు రావడంతో ఆయనకు కూడా పార్టీలో తగిన ప్రాధాన్యత ఇచ్చేలా హామీ తీసుకునేందుకు ప్రయత్నించారు. కానీ కేటీఆర్ సచివాలయంలో పలు సమావేశాలు, కార్యక్రమాలతో బిజీగా గడపడంతో మరోసారి జిల్లా నాయకులతో ప్రత్యేకంగా మరోసారి సమావేశమవుతామని చెప్పినట్లు తెలిసింది. ఇక గడ్డం అరవింద్‌రెడ్డి ఈ భేటీపై 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడుతూ 'ఇక్కడి పరిస్థితి వివరించాను. సర్‌తో డిస్కస్ చేసి చెప్తానని కేటీఆర్ చెప్పారు' అని తెలిపారు.

నష్ట నివారణ చర్యలు

పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రభుత్వ విప్, బాల్కసుమన్ ఎన్నికల ముందు ఇబ్బంది లేకుండా అసంతృప్త నాయకులను బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీలో అందరూ కలసిమెలిసి ముందుకు వెళ్లేందుకు కృషి చేస్తున్నారు. ఈ క్రమంలోనే జిల్లా నుంచి అసంతృప్తి నాయకుల్ని మంత్రి కేటీఆర్‌తో చర్చించేందుకు ప్రయత్నం చేశారు. అయితే సమయం వీలు కాకపోవడంతో మరోసారి కలిపించే యోచనలో ఉన్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు మంత్రి కేటీఆర్ వద్దకు వెళ్లలేదు. గతంలో ఆయన పార్టీ మారినప్పుడు సుమన్, కేటీఆర్ వద్దకు తీసుకెళ్లి పలు హామీలు ఇవ్వడంతోనే తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఉన్న అసంతృప్త నాయకుల్ని అధిష్టానం వద్దకు తీసుకెళ్లి చక్కదిద్దేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే అధికార పార్టీలో కొందరు పార్టీ మారగా మరింత నష్ట పోకుండా దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నారు.

లోక్ అదాలత్‌లో 5,100 కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రభాకరరావు

మంచిర్యాలక్రైం: ఎంతో కాలంగా కోర్టులో పెండింగ్‌లో ఉన్న 5,100 కేసులు లోక్ అదాలత్ ద్వారా శనివారం ఒక్క రోజే పరిష్కరించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకరరావ్ తెలిపారు. తెలంగాణ లీగల్ సెల్ అథారిటీ ఆదేశాల మేరకు జిల్లాలోని కోర్టు సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ మార్గమే రాజ మార్గమన్నారు. లోక్ అదాలత్ ద్వారా కక్షి దారులకు సరైన న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఇరువర్గాలు సమన్వయం చేసుకోవాలని అధికారుల సమక్షంలో రాజీ కుదుర్చుకోవాలని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా ఇచ్చిన తీర్పు అప్పీల్ లేని అంతిమ తీర్పని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లు ఎప్పుడు నిర్వహించినా రాజీ కుదుర్చుకోవడం ఎంతో ఉత్తమమని తెలిపారు. జిల్లాలోని వివిధ కోర్టు పరిధిల్లో నిర్వహించిన లోక్ అదాలత్‌లలో 5,100 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఇందులో బ్యాంకు కేసులు 35 కాగా, ఈ కేసుల్లో రూ.24.83 లక్షలు రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఉదయ్‌కుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అర్పితమారంరెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అజయ్ ఉల్లం, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఉపనిషధ్వని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తయ్య, పోలీస్ అధికారులు, న్యాయవాదులు, వివిధ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ సక్రమంగా నిర్వహించాలి



సమీక్షలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

చెన్నూర్: వ్యాక్సినేషన్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు అన్నారు. చెన్నూర్ మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ ప్రక్రియను శనివా రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పిల్లలకు వ్యాక్సిన్ కోర్స్ వరకు క్రమం తప్పకుండా వ్యాక్సిన్ చేయాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ప్రైవేట్ ప్రాక్టీషనర్లతో సమావేశం నిర్వహించారు. డెంగీ చికిత్స చేయవద్దని, డెంగీ లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రులకు పంపించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో అంగ్రాజుపల్లి వైద్యులు శివప్రసాద్, కృష్ణతేజ, ఆర్ఎంపీ వైద్యుల సంఘం అధ్యక్షుడు బండారి లక్ష్మణ్, హెల్త్ సూపర్‌వైజర్ జగదీశ్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీని పరిశీలించిన డీఎంహెచ్‌వో

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు పరిశీలించారు. పీహెచ్‌సీలో ఓపీ రిజిస్టర్లు, ఇతర రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు పెరిగేలా చూడాలన్నారు. సమావేశంలో వైద్యులు శివప్రతాప్, కృష్ణతేజ, ముస్తఫా, హెచ్ఈవో జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి
- మందమర్రి, కాసిపేట పోలీస్ స్టేషన్ల తనిఖీ
- నేరాల నియంత్రణకు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచన



మొక్క నాటుతున్న సీపీ రెమా రాజేశ్వరి

మందమర్రిరూరల్/కాసిపేట: శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రశాంత వాతావరణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి అన్నారు. మందమర్రి సర్కిల్ కార్యాలయాన్ని, దేవాపూర్ పోలీస్ స్టేషన్‌ను శనివారం తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ల నిర్వహణ, స్టేషన్లలో 5ఎస్ అమలు, ఫంక్షనల్ వర్టికల్స్, కోర్టు డ్యూటీ, రిసెప్షన్, టెక్ టీంల పనితీరు, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఠాణాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. డయల్ 100 కాల్ వచ్చినప్పుడు సంఘటన స్థలానికి వెళ్లడానికి పట్టే సమయాన్ని బ్లూకోల్ట్స్' సిబ్బంది ట్యాబ్‌లలో తనిఖీ చేశారు. పరిసరాలు, ఫిర్యాదులు, నేరాల నియంత్రణకు చర్యలు, సీసీ కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. అనంతరం మందమర్రి సర్కిల్ కార్యాలయంలో బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, సీఐ మహేందర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. నేరాల నియంత్రణకు అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు బిగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఎలాంటి నేరాలు జరిగినా సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నేరస్తులను గుర్తించడం సులువు అవుతుందని తెలిపారు. నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రజలు పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొనేందుకు శిక్షణ పొందిన సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తు సీపీస్థాయి నుంచి హోమ్‌గార్డు స్థాయి వరకు అప్రమత్తంగా ఉంటారని వివరించారు. మందమర్రి సర్కిల్ పరిధిలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ సందర్శించి సిబ్బంది ప్రజలకు ఎలాంటి సేవలందిస్తున్నారని తెలుసుకున్నారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. మందమర్రి, కాసిపేట ఠాణాల ఆవరణలో మొక్కలు నాటారు. సీపీ వెంట ఎస్సైలు ఆంజనేయులు, చంద్రకుమార్ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం



కాళోజీకి నివాళులర్పిస్తున్న కళాశాల సిబ్బంది

మంచిర్యాలటౌన్/బెల్లంపల్లి: ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి పురస్కరించుకుని శనివారం తెలంగాణ భాషా దినోత్సవం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీవోఈ)లో కాళోజీ నారాయణ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాళోజీ తెలంగాణ భాషకు చేసిన సేవలు, భాష గొప్పతనాన్ని వక్తలు విద్యార్థులకు వివరించారు. పాలకుల తప్పిదాలను ఎత్తిచూపుతూ, ప్రజల పక్షాన రచనలు చేశారని పేర్కొన్నారు. సమాజంలో పెనవేసుకున్న అసమానతలపై ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జీవితాంతం అక్షర సేద్యం చేశారని బెల్లంపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు అన్నారు. ప్రజా చైతన్యానికి తన రచనలు ఎంతగానో దోహదపడ్డాయని పేర్కొన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే కాళోజీ తెలంగాణ తొలి పొద్దు అని తెలిపారు. కార్యక్రమాల్లో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.సుమతి, వైస్ ప్రిన్సిపాల్ కె.శివలీల, తెలుగు విభాగ అధ్యాపకులు వి.స్వప్న, ఎ.భాగ్యలక్ష్మి, కె.అంజలి, గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు హారిక, స్రవంతి, పీఈటీ వామన్ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కమలం గెలుపు గుర్రాలెవరో?

- వచ్చే ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ ఆరాటం
- టికెట్ కోసం ఆశావహుల పోటాపోటీ అర్జీలు
- చివరి రోజు దరఖాస్తులు మరింత పెరిగే అవకాశం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కమలం పార్టీలో దరఖాస్తులు జోరుగా సాగుతున్నాయి. ఒక్కో నియోజకవర్గం నుంచి ఆశావహులు పోటాపోటీగా టికెట్ల కోసం అర్జీ పెట్టుకుంటున్నారు. ఆదివారంతో దరఖాస్తు గడువు ముగుస్తుంది. ఈ తరుణంలో తూర్పు జిల్లాగా ఉన్న మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లోని ఐదు శాసన సభ స్థానాలకు ఇప్పటికే పదుల సంఖ్యలో అర్జీలు పెట్టుకున్నారు. చివరి రోజు మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఎవరికి టికెట్ దక్కుతుందోనని ఆసక్తి నెలకొంది. ఈసారి ఎలాగైనా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ సత్తా చాటాలని ఆరాటపడుతున్న బీజేపీ అధిష్టానం ఆయా స్థానాల్లో సరైన అభ్యర్థులనే సమరంలోకి దింపాలని భావిస్తోంది. అర్జీలు ముగిశాక వివిధ దశల్లో అభ్యర్థులను వడపోత చేసి టికెట్లు ఖరారు చేయనున్నారు.

పోటాపోటీగా దరఖాస్తులు

ఉమ్మడి జిల్లాలో పది స్థానాల్లో కొన్ని నియోజకవర్గాల్లో పోటాపోటీగా దరఖాస్తులు చేస్తున్నారు. బీజేపీలో పార్టీ క్రమశిక్షణ, విధేయత, నాయకత్వ లక్షణాలు, పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేసే నాయకులకే ప్రథమ ప్రాధాన్యత ఉంటుందని చెబుతుంటారు. ఈ క్రమంలో అనేక మంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ సమర్థులైన నాయకులకే టికెట్ ఎంపిక చేస్తారని నాయకులు చెబుతున్నారు. మంచిర్యాల స్థానానికి జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు, ముల్కల మల్లారెడ్డి, పులగం తిరుపతి, తులా ఆంజనేయులు, తులా మధుసూదన్, డా.విజయ్ రఘునందన్, గాదె శ్రీనివాస్ తదితరులు దరఖాస్తు చేసుకునే వారిలో ఉన్నారు. చెన్నూరు నియోజకవర్గం నుంచి బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి, అందుగుల శ్రీనివాస్ తదితరులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. బెల్లంపల్లి నియోజకవర్గంలో గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన కొయ్యాల ఏమాజీతోపాటు ఇటీవల పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్టి వెంకట కృష్ణ తదితరులు టికెట్ కోసం పోటీ పడుతున్నారు. సిర్పూర్ టికెట్ కోసం డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు, డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం టికెట్ కోసం పోటీ పడుతున్నవారిలో ఉన్నారు. ఆసిఫాబాద్ నియోజకర్గంలో ఆదివాసీ నాయకుడు, తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు కోట్నాక విజయ్‌టికెట్ ఆశిస్తున్నారు. ఆయనతో పాటు ఆత్మారాంనాయక్ పోటీ పడుతున్నారు. వీరితోపాటు మరికొందరు టికెట్ ఆశిస్తున్నారు.

టికెట్ దక్కేదెవరికో...

నియోజకవర్గాల్లో పోటాపోటీగా కార్యక్రమాలు చేపడుతూ తమకే టికెట్ వచ్చేలా నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. అయితే వీరిలో ఎవరికి టికెట్ దక్కుతుందోనని పార్టీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. బీజేపీలో టికెట్ కేటాయింపులో పలు రకాలుగా పరిశీలన చేస్తున్న నేపథ్యంలో ఆశావహులు తమకే టికెట్ రావాలని కోరుకుంటున్నారు. గతంలో పోటీచేసి ఓటమి పాలైనవారు.. కొత్తగా పార్టీలో చేరుతున్నవారు, ఇది వరకే చేరిన వారు, ప్రజల్లో పట్టున్న వారు, ప్రత్యర్థులతో పోటీపడే సత్తా వంటి అంశాలు బేరీజు వేసుకుని అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే పార్టీ, అభ్యర్థుల పేర్లతో సర్వేలు జరిగాయి. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల తర్వాతనే అభ్యర్థుల మొదటి జాబితా విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు పార్టీవర్గాలు పేర్కొంటున్నాయి.



దరఖాస్తు సమర్పిస్తున్న డా.విజయ్ రఘునందన్

కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యం

బెల్లంపల్లి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సూచించారు. హైదరాబాదులోని టీఎస్ ఆర్టీసీ కళాభవన్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ తరగతులకు బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముఖ్య నాయకులు హాజరయ్యారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు గడిచిన తొమ్మిదేళ్ల నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆ కష్టాల నుంచి గట్టెక్కడానికి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ఏకైక మార్గమన్నారు. ఈ శిక్షణ తరగతులకు డీసీసీ ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు జి.జయరాం, సిలివేరి, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు రాజన్న, బానేష్, సరోజ, దామోదర్‌రెడ్డి, కృష్ణ, వెంకటశ్రీనివాస్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీజీఎం

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7, న్యూటెక్, వర్క్‌షాప్‌ల్లో గైర్హాజరు ఉద్యోగులకు శనివారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం సమావేశ మందిరంలో డీజీఎం (పర్సనల్) అరవిందరావు ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి హాజరు శాతాన్ని పెంచుకోవాలని సూచించారు. తరుచూ గైర్హాజరు అవుతున్న ఉద్యోగులపై సంస్థ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వారి రిపోర్టును పరిశీలించి తగు న్యాయం చేస్తామన్నారు. ఈ కౌన్సెలింగ్‌కు 53మంది ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కె.సురేందర్‌రెడ్డి, డాక్టర్ మురళీధర్, డీవై పీఎంలు రాజేశ్వర్‌రావు, రాజేశ్, సీనియర్ పీవోలు కాంతారావు, ప్రకాశ్, గని సంక్షేమ అధికారి సృజనాపాల్, కళ్యాణి పాల్గొన్నారు.

'నేను కోవర్టును కాను'



ప్రమాణం చేస్తున్న శ్రీనివాస్

మందమర్రిరూరల్: శ్రీవేంకటేశ్వరస్వామి సాక్షిగా ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడినట్లు నేను కాంగ్రెస్ పార్టీలో కోవర్టును కాదని పీసీసీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ దాసారపు శ్రీనివాస్ తెలిపారు. శనివారం స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రమాణం చేశారు. అనంతరం మందమర్రిలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నూర్ నియోజకవర్గంలో సుమన్ బలహీనంగా ఉండడంతోనే మతిభ్రమించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని ఆరోపించారు. నియోజకవర్గంలో ఆశావాహులు ఎంతమంది ఉన్నా అందరం కలిసి సుమన్ ఓడించడం ఖాయమన్నారు. ఆయన వెంట శ్రావణ్, లింగస్వామి, నవీన్, పవన్, రాహుల్, రవితేజ, రాజశేఖర్, సిద్దు ఉన్నారు.

న్యాయం చేయండి సారూ...



పోచుబాయి

కాగజ్‌నగర్‌రూరల్: తన పట్టా భూమిని పెద్దకుమారుడు తన అధీనంలో పెట్టుకుని వేధింపులకు గురిచేస్తున్నాడని ఓ వృద్ధురాలు కన్నీరుపెట్టుకుంటుంది. తనకు న్యాయం చేయాలని కాగజ్‌నగర్ మండలంలోని సీతానగర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు మౌల్కార్ పోచుబాయి శనివారం పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి వివరాల ప్రకారం... పోచుబాయికి ముగ్గురు కుమారులు తులసీరాం, విశ్వనాథ్, గణపతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 1999లో భర్త మల్లయ్య మృతిచెందగా, 40 ఎకరాల భూమిలో నుంచి ఐదు ఎకరాలు తల్లి పోషణకు కేటాయించి మిగతాది పంపకాలు చేసుకున్నారు. అప్పటి నుంచి పోచుబాయి పెద్ద కుమారుడి వద్ద ఉంటుంది. తల్లి పేరుపైన ఉన్న భూమిని పట్టా చేయించాలని పెద్ద కుమారుడు వేధించడం మొదలుపెట్టాడు. పోచుబా యి కాగజ్‌నగర్‌లో ఉంటున్న చిన్న కుమార్తె ప్రమీల వద్దకు వెళ్లింది. తనకు ఎలాగైన న్యాయం చేయాలని వృద్ధురాలు వేడుకుంటుంది.

ఓ క్షణం ఆలోచించు





"**ఇంటర్మీడియట్** ప్రథమ సంవత్సరం చదువుతున్న తాంసి మండలం పాలోది గ్రామానికి చెందిన అడెపు శృతి(17) మొహర్రం సెలవులకు ఇంటికి వచ్చింది. తనతో చనువుగా ఉంటున్న గ్రా మంలోని యువకుడి ఇంటికి వెళ్లిన విష యం తండ్రికి తెలిసి తనను మందలిస్తాడనే భయంతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తన విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంది."



"**భీంపూర్** మండలంలోని అందర్‌బంద్ ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదివే అనురాగ్ (13) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చదువుకోవాల్సిన వయస్సులో బడి మానేసి ఇంటి వద్ద ఉండడంతో బుద్ధిగా బడికి వెళ్లి చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించారనే కారణంతో తన నూరేళ్ల జీవితానికి ముగింపు పలికి తల్లిదండ్రులకు పుత్రశోకాన్ని మిగిల్చాడు."



"**జైనథ్** మండలం మేడిగూడ గ్రామానికి చెందిన డౌరే రవీందర్ అనే కౌలు రైతు తనకున్న మూడెకరాలతో పాటు మరో 14ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి పంట సాగుచేశాడు. వర్షాభావ పరిస్థితులతో పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడం, పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు తీర్చే మార్గం కన్పించకపోవడంతో పురుగుల మందుతాగి ఆత్మహత్య కు పాల్పడ్డాడు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడం ఆయన భార్య, ఇద్దరు పిల్లలు రోడ్డునపడ్డారు. భార్య స్వప్న కూలీ పనిచేస్తు పిల్లలను పోషించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.



"**బోథ్** మండలం ధన్నూర్ గ్రామానికి చెందిన పాముల సంతోష్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆటోను ఫైనాన్స్‌పై తీసుకున్నాడు. గిరాకి ఆశించనంతగా రాకపోవడం, కుటుంబ పోషణ భారమవుతుందనే కారణంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో అతని భార్య, ఇద్దరు పిల్లలు ఆధారాన్ని కోల్పోయి దిక్కులేని వారిగా నానా అవస్థల నడుమ కాలం వెల్ల దీయాల్సి వస్తోంది.

- చిన్నపాటి కారణాలకే మృత్యుఒడికి
- యమపాశంగా మారుతున్న క్షణికావేశం
- అనాథలవుతున్న పిల్లలు... కన్నవారికి పుత్రశోకం
- నేడు ఆత్మహత్యల నివారణ దినం

కైలాస్‌నగర్: పుట్టిన ప్రతి మనిషికి జీవితంలో ఏదో ఒక సమస్య ఎదురవుతూనే ఉంటుంది. సమస్య ఎంత పెద్దదైనప్పటికీ దానికి పరిష్కారం ఉంటుంది. అయితే ఆ సమస్యను స్వీకరించే తీరు, దాన్ని పరిష్కరించుకునే విధానమే కీలకం. తమకు ఎదురైన సమస్యను తెలుసుకుని దానిని అధిగమించే మార్గాలను వెతుకుంటే సమస్యకన్న పరిష్కార మార్గాలే ఎక్కువగా కన్పిస్తాయి. తమకున్న సమస్యనే పెద్దదిగా భావించి విచక్షణ కోల్పోయి క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఎదురైన సమస్యతో బాధపడకుండా మన అనుకునేవారికి చెప్పుకుంటే సగం పరిష్కారం అప్పుడే లభిస్తోంది. పిల్లల భవిష్యత్తు ఏమిటని ఆలోచన చేయకుండా ఆత్మహత్యకు పాల్పడి పిల్లలను వీధి పాలు చేస్తున్నారు. పిల్లలు తెలిసి, తెలియని వయస్సులోనే ఆత్మహత్యకు ఒడిగట్టి తల్లిదండ్రులకు తీరని దుఖాన్ని మిగుల్చుతున్నారు.

మానసిక ఒత్తిడితోనే ఆత్మహత్యలు



మానసిక ఒత్తిడితోనే ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతుంటాయి. డిప్రెస్సన్‌లో ఉన్న వ్యక్తి నడవడిలో మార్పు వస్తుంది. గమనించి వైద్యుల వద్ద చికిత్స, కౌన్సెలింగ్ అందిస్తే వారిని ఆత్మహత్యలకు పాల్పడకుండా కాపాడవచ్చు. మానసిక సంఘర్షణకు గురై, సహనం లేనటువంటి వారు క్షణికావేశాల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి వారిని ముందుగానే గుర్తించి కౌన్సెలింగ్ చేస్తే వారు ప్రాణాలు తీసుకోకుండా చూడవచ్చు.

– డాక్టర్ ఓంప్రకాశ్, రిమ్స్ మానసిక వైద్య నిపుణులు

బతికే మార్గం చూడాలి



చేతినిండా పనిదొరక్క, ఉపాధి అవకాశాలు లేక కుటుంబ భారాన్ని మోయలేక చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. పంటలు సరిగ్గా పండక, గిట్టుబాటు ధరల్లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇలా చేసుకోవడం ద్వారా వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఆత్మహత్యలను అరికట్టేలా చర్యలు చేపట్టాలి.

– సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు

కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం



ఆత్మహత్యలు చేసుకోకుండా ఎస్సైలు తమ పరిధిలో రెగ్యులర్‌గా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ప్రజల్లోకి వెళ్లి ఆత్మహత్యలు చేసుకోకుండా వాటి వల్ల ఎదురయ్యే పరిణామాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఆత్మహత్యలనేవి సమస్యకు ఏ మాత్రం పరిష్కారం కావు. సమస్యలు వచ్చినప్పుడు ఆందోళన చెందకుండా విచక్షణతో ఆలోచిస్తే ఎలాంటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చు.

– డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ

తెగిన కరెంట్ తీగలు.. నిలిచిన విద్యుత్ సరఫరా

బెల్లంపల్లి: కార్మిక క్షేత్రం బెల్లంపల్లిలో సింగరేణి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శుక్రవారం రాత్రి పది గంటల ప్రాంతంలో కరెంటు సరఫరా నిలిచిపోయింది. బెల్లంపల్లి బస్తీ శివారు ప్రాంతంలోని 3.5 కేవీ సింగరేణి విద్యుత్ లైన్‌కు ఉన్న కరెంటు తీగలు ఆకస్మికంగా కిందతెగిపడ్డాయి. దీంతో పోస్ట్ ఆఫీస్ బస్తీ, టేకులబస్తీ, 24డీప్ ఏరియా, కన్నాల బస్తీలలో కరెంట్ సరఫరా లేకుండా పోవడంతో వందలాది కార్మిక కుటుంబాలు రాత్రంతా జాగారం చేశాయి. కనీసం మరుసటి రోజు శనివారం కరెంట్ సరఫరాను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటారని ఆశించిన కార్మిక కుటుంబాలకు నిరాశే ఎదురైంది. మందమర్రి నుంచి విద్యుత్ ఎలక్ట్రిషియన్‌లు, ఇతర సిబ్బంది రాకపోవడంతో విద్యుత్ పునరుద్ధరణ పనులు జరగలేదు. సింగరేణి అధికారుల నిర్లక్ష్యంతో ఆదివారం వరకు కరెంటు సరఫరా అయ్యే అవకాశాలు లేవని విద్యుత్ సిబ్బంది చెబుతున్నారు. 24గంటల వ్యవధిలో కరెంటు సరఫరాను మెరుగుపరచాల్సి ఉన్న మందమర్రి ఏరియా అధికారులు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి బెల్లంపల్లి కార్మిక కుటుంబాలకు శాపంగా మారాయి. వర్షాకాలం కావడంతో రాత్రి పూట దోమల బెడదతో తీవ్ర ఇబ్బ ందులు పడుతున్నారు. మరో 24 గంటలు గడిస్తే కానీ కరెంటు వచ్చే అవకాశాలు లేక స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సింగరేణి ఏరియా జీఎం వెంటనే స్పందించి కరెంట్ సరఫరా చేసేలా చూడాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నాయి.

భారీగా రేషన్ బియ్యం తరలింపు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని పలు గ్రామాల్లో సేకరించిన రేషన్ బియ్యం అక్రమ మార్గంలో తరలిస్తున్నారు. శనివారం హాజీపూర్ జాతీయ రహదారి మీదుగా దాదాపు పదుల సంఖ్యలో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం ఆటో ట్రాలీల్లో ఇతర ప్రాంతాలకు నంబర్ ప్లేట్ లేని వాహనాల్లో తరలిస్తున్నారు. ఈ రేషన్ బియ్యం పెద్ద మొత్తంలో మండలం నుంచి తరలుతుండగా ఈ అక్రమార్కులకు ఓ ప్రజాప్రతినిధి అండదండలు మెండుగా ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో రెవెన్యూ అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యంను బేషరతుగా విడిపించడం కొసమెరుపు. అక్రమార్కులు రూ.12 నుంచి రూ.15వరకు చెల్లి స్తూ నేరుగా బియ్యం కొనుగోలు చేస్తూ మహారాష్ట్రకు తరలిస్తున్నారు.

ఆపరేషన్ పేకాట..!

- క్వారీ టెంపుల్ వద్ద ఇద్దరు అరెస్ట్ ఐదుగురు పరార్
- రూ. 4,33,500 స్వాధీనం
- కవరేజ్‌కి వెళ్లిన విలేకరిపై దురుసుగా ప్రవర్తించిన ఎస్సై



పట్టుకున్న కారు, నగదు, పేకాటరాయుళ్లతో ఎస్సై

మంచిర్యాలక్రైం: జిల్లాలో పేకాటాడుతున్న వారిపై పోలీస్ యంత్రాంగం నిఘా ఏర్పాటు చేసింది. పక్కా సమచారం మేరకు ఇద్దరు ఎస్సైలు రెండు బృందాలుగా ఏర్పడి 'ఆపరేషన్ పేకాట' పేరుతో శనివారం జిల్లా కేంద్రం సమీపంలోని క్వారీ అటవీ ప్రాంతంలో దుర్గాదేవి ఆలయం వద్ద పేకాటాడుతున్నారనే సమాచారం మేరకు హాజీపూర్ ఎస్సై నరేష్, మంచిర్యాల టౌన్ ఎస్సై రాజేందర్ దాడిచేశారు. ఐదుగురు పేకాట రాయుళ్లు తప్పించుకోగా ఇద్దరిని పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.4లక్షల 33వేల 5వందలు నగదు, కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కాగా పేకాటాడుతూ అరెస్ట్ అయిన వారిలో పెద్దపెల్లి జిల్లా రామగుండంకి చెందిన సాదుల సదానందం, ఎన్‌టీపీసీకి చెందిన పల్లె ఆంజనేయులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక సీఐ రాజు తెలిపారు. తప్పించుకున్న వారిలో మంచిర్యాల, రామగుండంకు చెందిన వారు ఉండడం గమనార్హం.

విలేకరిపై దురుసుగా ప్రవర్తించిన ఎస్సై...

పేకాటరాయుళ్ల అరెస్ట్ విషయం తెలుసుకున్న ఓ విలేకరి వార్త కవరేజీకి సంఘటన స్థలానికి వెళ్లి ఫొటోలు తీసే ప్రయత్నం చేయగా ఎస్సై అతడిపై దురుసుగా ప్రవర్తించాడు. విలేకరి అని చెప్పిన వినకుండా అయితే ఏమిటని, అతడి కారును ఫొటోలు తీశాడు. పేకాటరాయుళ్లను అరెస్టు చేసింది ఓ చోట అయితే మారో చోటకి ఎందుకు తరలిస్తున్నారని, సదరు విలేకరి ఎస్సైని ప్రశ్నించడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని సదరు విలేకరి అక్కడి నుంచి వెళ్లిపోవడంతో గొడవ సద్దుమనిగింది. ఎస్సై, సదరు విలేకరి మధ్య జరిగిన వాగ్వాదం సోషల్ మీడియలో వైరల్ కావడంతో జిల్లాలో చర్చనీయాంశమైంది.

బీసీ పాలసీ అమలు చేయాలి

- బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకుల డిమాండ్



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: రాష్ట ప్రభుత్వం బీసీ పాలసీ అమలు చేయాలని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ కోరారు. బీసీ పాలసీని అమలులో రాష్ట ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి శనివారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం 2017లో ప్రజాప్రతినిధులలో చర్చలు జరిపి 210 తీర్మానాలు రూపొందించి బీసీ పాలసీని అమలు చేస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్ ఆరు సంవత్సరాలు గడిచినా నెరవేర్చలేదన్నారు. సీఎం బీసీలను మభ్యపెడుతున్నారని తెలిపారు. స్వరాష్ట సాధనలో కీలక పాత్ర పోషించిన బీసీలు వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణ్, నాయకులు మహేశ్, జైపాల్‌సింగ్, గజ్జెల్లి వెంకటయ్య, కంచర్ల కొమురయ్య, చంద్రమౌళి, ఆరెందుల రాజేశం, అంకం సతీశ్ పాల్గొన్నారు.

నేడు బీసీ రాజ్యాధికార సమాలోచన సభ

బీసీ రాజ్యాధికార సమాలోచన సభ జిల్లాలోని సీసీసీ షిర్కే కాలనీలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించనున్నట్లు బీసీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్ తెలిపారు. బీసీల రాజ్యాధికారం కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై సభలో చర్చిస్తామన్నారు. ఈ సభకు జిల్లాలోని బీసీ సంఘాలు, బహుజన సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో బీసీల ఐక్యవేదిక సీనియర్ నాయకులు రంగు రాజేశం, కనుకుట్ల మల్లయ్య, నీరటి రాజన్న, మేరు సంఘం నాయకులు మాడిశెట్టి విశ్వం, కురుమ సంఘం నాయకులు, సమ్మి రాజన్న, గాండ్లతేలికుల సంఘం నాయకులు చంద్రమౌళి, మొగిలి తిరుపతి, సోమయ్య భూమన్న తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులను వేధించడం మానుకోవాలి'



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

కాసిపేట: అధికారులు కార్మికులను వేధించడం మానుకోవాలని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ నరేందర్, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య డిమాండ్ చేశారు. శనివారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై ఏర్పాటు చేసిన గేటు మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. కాసిపేట గనిని సొంత ఇలాఖల మార్చుకున్న కొందరు అధికారులు కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తూ ఉత్పత్తికి సంబంధం లేకుండా కార్మికులను కష్ట పెడుతున్నారన్నారు. టెక్నీషియన్‌లకు, టెక్నీకల్ సూపర్‌వైజర్లకు, మైనింగ్ సూపర్ వైజర్ సిబ్బందికి ఎనిమిది నెలల కాలంలో 160 మస్టర్లు లేని వారిని కుటుంబంతో సహ కౌన్సెలింగ్‌కు రావాలని నోటీసులు వేయడాన్ని ఐఎన్‌టీయూసీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. వారికి లీవులు ఉన్నప్పటికీ అధికారులు సంతకాలు చేయకుండా గైర్హాజరు వేస్తూ ఆర్థికంగా నష్టం చేస్తున్నారన్నారు. పని ఒత్తిడితో కార్మికుడు విధులకు సక్రమంగా హాజరు కాలేక మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి దోరిశెట్టి చంద్రశేఖర్, బత్తుల వేణు, మండ భాస్కర్, కారుకూరి తిరుపతి, ఫిట్ కార్యదర్శి రవిందర్, నాయకులు శివ, చక్రపాణి, సురేష్, కుమారస్వామి, ప్రశాంత్ ఉన్నారు.

సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ



స్వామికి స్వాగతం పలుకుతున్న సిబ్బంది

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియా ఎస్అండ్‌పీసీ భద్రతా విభాగం సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా పోగుల స్వామి ఎస్అండ్ పీసీ కార్యాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. పోగుల స్వామి కొత్తగూడెం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన సీనియర్ ఇన్‌స్పెక్టర్ అజీముద్దీన్ కొత్తగూడెం ఏరియాకు బదిలీ అయ్యారు. స్వామికి సీనియర్ సెక్యూరిటీ అధికారి మురళీ మోహన్, సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి అతడికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఇన్‌స్పెక్టర్ సిర్ర రాజయ్య, జమ్మేదార్‌లు కనకయ్య, సత్యానారాయణ, సీనియర్ సూపరింటెండెంట్ శంకరయ్య, ఐడీ పార్టీ సిబ్బంది రమేశ్, విజయ్ పాల్గొన్నారు.

17న మోటార్ మెకానిక్ ఉద్యోగాలకు పరీక్ష

రెబ్బెన(ఆసిఫాబాద్)/మందమర్రిరూరల్: సింగరేణిలో ఖాళీగా ఉన్న మోటార్ మెకానిక్ ట్రైనీ ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 17వ తేదీన రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు జీఎం పర్సనల్ వెల్ఫేర్ అండ్ ఆర్సీ కె.బసవయ్య తెలిపారు. సంస్థలో ఖాళీగా ఉన్న మోటార్ మెకానిక్ ట్రైనీ క్యాటగిరీ-1 ఉద్యోగాల భర్తీ కోసం యాజమాన్యం 2017 నోటిఫికేషన్ విడుదల చేయగా దరఖాస్తు చేసుకున్న అర్హులైన అభ్యర్థులకు 17వ తేదీన కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మధ్యాహ్నం 2గంటల నుంచి 3.30గంట ల వరకు రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలి పారు. రాత పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను సింగరేణి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూ చించారు. హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవటంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే హెల్ప్‌డెస్క్ ఫోన్ 08744 249992 నంబర్‌ను ఆఫీస్ పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



సాగర్ (ఫైల్)

తాండూర్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో శనివా రం చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ వివరాల ప్రకారం... మండలంలోని రేచిని గ్రామ పంచాయతీ గజ్జలపల్లి గ్రామానికి చెందిన మొగిలి సాగర్ (31) ఇంజినీరింగ్ పూర్తి చేసి ఇంట్లోనే ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నాడు. కొంతకాలం మానసిక ఒత్తిడితో ఒంటరిగా ఉంటున్నాడు. సాగర్ తల్లి బానమ్మ బెల్లంపల్లిలోని సింగరేణిలో విధులు నిర్వహిస్తోంది. తల్లి విధులకు వెళ్లగా సాగర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన సోదరుడు సాగర్‌ను హుటాహుటినా బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



నృత్యం చేస్తున్న యువతులు, మహిళలు

సంబురంగా తీజ్



లక్సెట్టిపేట: తీజ్ సంబురాల్లో యువతులు

జన్నారం: లంబాడి గిరిజనుల పండుగ తీజ్‌ను మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి లంబాడాలు పొనకల్ జువ్విగూడలోని సేవలాల్ ఆలయానికి చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి అక్కడి నుంచి మండల కేంద్రంలోని అంగడీ బజార్‌లోని సేవలాల్ చౌక్ వద్దకు చేరుకున్నారు. వారం రోజులుగా మట్టిలో వేసిన గోధుమలు, వరిగింజలు మొకలెత్తగా వాటిని నెత్తిన పెట్టుకుని మహిళలు సంప్రదాయ నృత్యాలు చేశారు. పురుషులు ఒకే రంగులోని పట్కా ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అంగడీబజార్ నుంచి పోలీస్‌స్టేషన్ సమీపంలోని వాగు వరకూ నృత్యాలు చేస్తూ ర్యాలీ తీశారు. అనంతరం వాగులో తీజ్ బుట్టలను నిమజ్జనం చేశారు.

ప్రముఖుల హాజరు..

జన్నారం మండలంలోని తీజ్ ఉత్సవాలకు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు హాజరయ్యారు. బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ అభ్యర్థి జాన్సన్ నాయక్ హాజరై పురుషులతో కలిసి నృత్యం చేశారు. అలాగే బీజేపీ రాష్ట ఫ్లోర్ లీడర్ జానుభాయి, బీఎస్పీ అభ్యర్థి బన్సిలాల్, కాంగ్రెస్ నాయకులు కిషన్ నాయక్‌లు హాజరై పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బంజార సేవా సమితి, ఉత్సవ సమితి నాయకులు సందేశ్, ప్రకాశ్‌నాయక్, దశరథ్, ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్‌లు రమేశ్, రాజన్న, వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రియాజోద్దీన్, పొనకల్ సర్పంచ్ జక్కు భూమేశ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు రాజారాంరెడ్డి, నాయకులు ఫజల్‌ఖాన్, జనార్దన్ ఉన్నారు.

ఘనంగా తీజ్ సంబరాలు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని సత్యసాయినగర్ కాలనీ, చందారం గ్రామంలో లంబాడాలు తీజ్ పండుగను శనివారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు తీజ్ బుట్టలను ఎత్తుకుని డ్యాన్స్‌లు చేస్తూ సంబురాలు చేసుకున్నారు.

మైనింగ్‌స్టాఫ్ ఉద్యోగుల సమస్యలు తీర్చాలి

నస్పూర్: సింగరేణిలో మైనింగ్ స్టాఫ్ అండ్ టెక్నికల్ స్టాఫ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సింగరేణి హెడ్ ఆఫీస్ కొత్తగూడెం ఎదుట నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట అధ్యక్షుడు, వేజ్ బోర్డు శాశ్వత సభ్యులు వి.సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ దీక్షలను ప్రారంభించి మాట్లాడారు. అనారోగ్య కారణాలతో అన్‌ఫిట్టైన మైనింగ్ అండ్ టెక్నికల్ ఉద్యోగులను సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ కల్పించాలన్నారు. రిటైర్డ్ అయిన మైనింగ్ అండ్ టెక్నికల్ ఉద్యోగులను ఎంవీటీసీలలో నియమించడానికి యాజమాన్యం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా సింగరేణి ఉద్యోగులకు రావాల్సిన 11వ వేజ్ బోర్డుకు సంబంధించిన 23నెలల వేతనాలను ఒకే దఫాలో చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా 35శాతం లాభాల వాటాను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు జనరల్ సెక్రటరీ మిర్యాల రంగారావు, కార్యదర్శులు సారయ్య, వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, మైనింగ్ స్టాఫ్ నాయకులు మల్లికార్జున్, రాజేశ్వర్‌రావు, బాపు పాల్గొన్నారు.

సర్క్యులర్ జారీ...

సింగరేణిలోని ఎంవీటీసీలలో రిటైర్డ్ మైనింగ్ అండ్ టెక్నికల్ స్టాఫ్ ఉద్యోగులను తీసుకోవడాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ సింగరేణి యాజమాన్యం శనివారం సర్క్యులర్ జారీ చేసింది.

టింబర్ యార్డు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రియాజ్ అహ్మద్

నస్పూర్: సింగరేణిలోని టింబర్ యార్డులో పనిచేస్తున్న ఫీస్ రేటెడ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని హెచ్ఎంఎస్ రాష్ట అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ డిమాండ్ చేసారు. శనివారం ఆయన శ్రీరాంపూర్ ఏరియా టింబర్ యార్డులో ఈ నెల 12న చేపట్టే నిరాహార దీక్షలకు సంబంధించిన వాల్ పోస్టర్లను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ టింబర్ యార్డు ఉద్యోగులకు గ్రూప్ 5ఏ వేతనాలు చెల్లించాల్సి ఉండగా మొదటి క్యాటగిరీ వేతనాలు చెల్లిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. టింబర్ యార్డు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య, కేంద్ర కార్యదర్శి గోళ్ల సత్తన్న, నాయకులు పల్లె క్రాంతికుమార్, దుర్గం లక్ష్మణ్, మేడి పెద్దన్న, మీస కొమురయ్య, నర్సయ్య, వినయ్ పాల్గొన్నారు.